

నేడు శంఖవరంలో గిరిజన సభ

ప్రజాశక్తి-రౌతులపూడి

శంఖవరంలో ఆదివారం నిర్వహించనున్న గిరిజన సభను విజయవంతం చేయాలని గిరిజన సంఘం నాయకులు ముసలయ్య బాలరాజు కోరారు. నాన్ షెడ్యూల్ ఆదివాసీ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో 553 నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను5 షెడ్యూల్లో చేర్చి గిరిజన హక్కులు కల్పిస్తామని 2019కి ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా నేటికీ అమలకు చేయకపోవడం బాధాకరమన్నారు. దీనిపై 30న శంఖవరంలో నిర్వహించనున్న సభకు సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, అఖిల భారత ఆదివాసీ సంఘం నాయకులు అజయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

జగనన్న కాలనీలో వసతుల కరువు

రహదారులు లేక ఇబ్బందులు

భవన నిర్మాణ సామగ్రి తరలింపునకు అదనపు భారం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతున్న జగనన్న కాలనీలు కనీసం గృహ నిర్మాణాలు జరగని పరిస్థితి ఏలేశ్వరంలో ఏర్పడింది. ఏలేశ్వరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఇచ్చిన పైపులైన్ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడం లేదు. అద్దె ఇంట్లో ఉండలేక, అద్దెలు చెల్లించలేక అప్పులు చేసి మరీ కొంత మంది ఇళ్లను నిర్మించుకున్నారు. కాని వారికి కనీస వసతులు కరువయ్యాయి. గృహ నిర్మాణాలకు సిమెంట్, ఇసుక ఇటుక వంటి సామగ్రి తీసుకెళ్లడానికి కనీస రహదారి లేకపోవడంతో లింగంపర్తి మీద నుండి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒక సిమెంట్ బస్తా అయినా 10 సిమెంట్ బస్తాలైన ఆటోకు రూ.300 చెల్లించాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గహ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రుణం ఎలాగూ సరిపోదు కనీసం అప్పులు చేసి నిర్మించుకుందాం అన్న రెండు రెట్లు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. జగనన్న కాలనీలో వసతులు బ్రహ్మాండంగా ఏర్పాటు చేస్తున్నామని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఊదరగొడుతున్న ఏలేశ్వరంలో అందుకు భిన్నంగా ఉంది. పైపులైన్ అవతల నుంచి మూడు కిలోమీటర్ల లోపల ఇచ్చిన జగనన్న స్థలాల్లోకి వెళ్లాలంటే పెద్ద పంట కాలవ దాటి వెళ్లాల్సి వస్తోంది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థలాలు ఏదో ఇచ్చామన్న పేరుకే ఇచ్చారు కానీ కనీసం రహదారులు లేవని, కాలనీలో దారులు అటు నుంచి కాలనీకి వెళ్లే దారి చూపించండి మహా ప్రభో అని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇల్లు నిర్మించుకున్న వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పప్పుకైనా ఉప్పుకైనా ఊర్లోకి రావాలంటే పంట పొలాల మధ్య నుంచి మట్టిబాటపై కాలువలు దాటుకుని రావాల్సి వస్తోంది. కనీసం మాత్ర కొనుక్కోవాలి అన్నా ఏలేశ్వరం రాలేని దుస్థితిలో జీవిస్తున్నామని వారు అంటున్నారు. ఇల్లు నిర్మించు కోకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని వాలంటీర్లు చెప్పడంతో అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నామని, ఇటు కాలనీలో నివసించలేక అటు ఊర్లో అద్దెలు కట్టుకోలేక ఏం చేయాలో తెలియని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం లింగంపర్తి నుంచి అయినా తిరిగి వద్దామంటే ఆ రహదారి సైతం ఇటీవల వర్షాలకు శిథిలావ్యవస్థకు చేరుకుందని వారు అంటున్నారు. ఈ విషయమై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎన్ని ఫోన్లు చేసిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా పైప్ లైన్ జగనన్న కాలనీకి ప్రధాన రహదారి నిర్మించి ఇళ్ళ నిర్మాణాలు త్వరితగతిన సాగేలా చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.



ఏలేశ్వరంలో జగనన్న కాలనీ



జగనన్న కాలనీలకు వెళ్లే లింగంపర్తి- తిరుమాలి రహదారి



రోడ్డు గుంతలో నిలిచిన వర్షపు నీరు



ప్రధాన రహదారి నిర్మించాలి

ఇల్లు కట్టుకోవడానికి చేసిన అప్పులు వడ్డీ కట్టలేక, అద్దెలు చెల్లించలేక ధైర్యం చేసి ఇంట్లోకి దిగాం. రావడానికి పోవడానికి రహదారి లేక పిల్లలు చదువు మాన్పించుకోవలసి వచ్చింది. ఇప్పటికైనా ప్రధాన రహదారి నిర్మించాలి.

బి.పద్మావతి, ఏలేశ్వరం.



ఇంటికి వెళ్లేందుకు దారి లేదు

ఇల్లు నిర్మించుకోకపోతే స్థలం వెనక్కి తీసుకుంటామని వాలంటీర్లు చెప్పడంతో అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాం. తీరా ఇంట్లోకి దిగాక నిత్యవసరాలు కొనుక్కోవడానికి వెళ్లేందుకు కూడా దారి లేదు. పొలాల మధ్య నుంచి గల బాటమీదుగా వెళదామంటే ఆకతాయిల వేధింపులు, పాములు ఇతర విష కీటకాలతో భయంగా వెళ్లాల్సి వస్తోంది. ఏలేశ్వరం నుంచి కాలనీకి ప్రధాన రహదారిన నిర్మించారు. ప్రభుత్వం, అధికారులు చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా ఉంది.

గొల్లపల్లి సూర్యకళ, ఏలేశ్వరం.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

హింసపై పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న హింసపై మహిళల పోరు యాత్ర జయప్రదం చేయాలని పలువురు పిలుపు ఇచ్చారు. శనివారం ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యాన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు భూలక్ష్మి, కె.నాగజ్యోతి మాట్లాడుతూ ఈ పోరు యాత్ర విశాఖపట్నం, హిందూపురం నుండి ఈ నెల 28న బయలు దేరిందని, ఆగస్టు 8న విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్ర తుని, పిఠాపురం మీదుగా ఆగస్టు 1న కాకినాడ చేరుతుందన్నారు. ఆ రోజు మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అత్యాచారాలు, హింస జరిగిన తర్వాత బాధపడే కంటే, హింస జరగకుండా అరికట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. హింసను ప్రేరేపించే మద్యం నిషేధించాలని, మాదకద్రవ్యాలు అరికట్టాలని మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అమానుష సంఘటనలను అరికట్టాలని, దోషులను తక్షణమే శిక్షించాలని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు భవాని, కుమారి పాల్గొన్నారు.

కేశవస్వామి దేవస్థానం ఇఒపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు కేశవ స్వామి ఆలయ ఇఒ యర్రా వెంకటేశ్వరరావు విధులకు హాజరు కాకుండా అలసత్వం వహిస్తున్నారని దేవస్థానం చైర్మన్ కొల్లు శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు శనివారం విలేకరులతో మాట్లాడారు. శనివారం హాజరు పట్టికను పరిశీలించగా జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పేరు ఎదురుగా 29వ తేదీ, 30వ తేదీ ముందుగా హాజరు వేసి ఉందని, విఒ విధులకు హాజరు కాలేదని తెలిపారు. ఉద్యోగులు కొంతమంది డ్యూటీ చేయకపోయినా డ్యూటీ చేసినట్టు హాజరు వేయించుకుని దేవుని సొమ్ము జీతాల పేర డ్రా చేస్తున్నట్టు తెలిపారు. ఆలయ ఇఒ వెంకటేశ్వరరావు ఆయనకు గుర్తు వచ్చినప్పుడు గుడికి రావడం, ఒకేసారి హాజరు పట్టికలో సంతకాలు పెట్టడం చేస్తున్నారన్నారు. గుడి అభివద్ధి కోసం కోసం ఎవరన్నా అడిగితే రైతులు డబ్బులు కట్టడం లేదని తప్పించుకుంటున్నారని తెలిపారు. ఈ అక్రమాలపై ఎండోమెంట్ డిసికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ బిల్లకుర్తి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసిలు రచ్చ ముత్యాలు, నంది కోళ్ల శ్రీదేవి, స్థానిక నాయకులు చిట్టూరి చలపతి, నందికోళ్ల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



హాజరు పట్టీని పరిశీలిస్తున్న దేవస్థానం చైర్మన్

కరప పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి -కరప

కరప పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్‌పి సతీష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. క్రైమ్ రికార్డులు, డ్యూటీ రికార్డులు, పెండింగ్ కేసులపై ఎస్ఐ ఎన్.రామకృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణంలో సక్రమంగా ఉండడంతో ఎస్ఐ రామకృష్ణను ఎస్‌పి అభినందించారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాల్లో వివిధ సంఘటనలపై ఎప్పటికప్పుడు నోట్ చేసుకుని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఎస్‌పి వెంట సిఐ కె.శ్రీనివాసులు, ఎఎస్ఐ ప్రసన్నకుమార్, కానిస్టేబుల్ లోవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్‌పి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

అన్నవరంలో పనుల పరిశీలన

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, చైర్మన్ ఐవి రోహిత్ కమిషనర్ దంపతులకు స్వామివారి జ్ఞాపికను ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కమిషనర్ కొండపైన ట్రాఫిక్ అంతరాయం లేకుండా జరుగుతున్న అంతర్గత రహదారుల నిర్మాణ పనులు, శివ సదన్ సత్రం దాత సహకారంతో నిర్మిస్తున్న డార్మెటరీ పనులను పరిశీలించారు. ఇఒకు పలు సూచనలు చేశారు.



ఎన్నికైన జిల్లా కమిటీతో జెఎసి నాయకులు

విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షునిగా చిన్న

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఎపిఆర్ఎస్ఎ రెవెన్యూ భవనంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు శనివారం ఎఎ జెఎసి అమరావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర నాయకుడు కె.చంద్రశేఖర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, ఎపి అమరావతి జెఎసి వైస్ చైర్మన్ కె.శ్రీనివాసరావు ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా విఆర్ఒ రాష్ట్ర సంఘం అధ్యక్షులు కోన ఆంజనేయ కుమార్ (చంటి), ప్రధాన కార్యదర్శి అనుపమ సహాయ కార్యదర్శి కెఎ.చారి, ఉపాధ్యక్షుడు సాయి సత్యనారాయణ ప్రసాద్, శంకర్, జాయింట్ కార్యదర్శి కె.చిన్నారావు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.చిన్నా, సహాధ్యక్షునిగా ఎస్‌వికెటి.సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జివి.సూరిబాబు ఉపాధ్యక్షునిగా పరమేశ్వర రాజు, ఎన్.సత్యనారాయణ, యు.నాగవేణి, కోశాధికారిగా బి.భాగయ్య మరియు 25 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దేవాదాయ భూముల దోపిడీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

దేవాలయ భూములు అమ్ముకుని పెద్ద ఎత్తున సొమ్ములు చేసుకుంటున్న పెత్తందారీతనాన్ని జిల్లా కలెక్టర్ అరికట్టాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కాకినాడ రూరల్ గైగోలుపాడు గ్రామానికి చెందిన విష్ణాలయం భూమినిఅమ్మకం పెట్టిన వైనాన్ని అక్కడి మాజీ ఎంపిటిసి పితాని వెంకటరాము ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తెలిపి వెలుగులోకి తేవడం అభినందనీయ మన్నారు. ఆర్‌డిఒ పర్యవేక్షణలో విచారణ చేయాలని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు కోరారు.

మణిపూర్ సంఘటనపై నిరసనలు

ప్రజాశక్తి -యంత్రాంగం

కరప అంబేడ్కర్ యువజన సేవా సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన దాడికి నిరసనగా కరపలో ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, వేళంగి గ్రామ సర్పంచ్ సవిలే నీలిమరాజేష్, ఆశా వర్కర్స్ సంఘం నాయకులు రెడ్డి వెంకటలక్ష్మి, దళిత నాయకులు సాదే లోహిదాస్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విగ్రహం వద్ద నుండి కరప పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ, తహశీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు సవిలే రాజేష్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన దాడి, యావత్తు దేశంపై జరిగిన దాడి అన్నారు. స్త్రీలను నగ్నంగా ఊరేగించడం ఏ దేశ సంస్కృతి అని ఆయన ప్రశ్నించారు. పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు ఎం.రాజ్ కుమార్, మూరా అవినాష్, మాతా అప్పారావు, సాధనాల పద్మావతి, సాదే వీర రాఘవులు, రొక్కాల నూకరాజు, మారేళ్ళ వెంకట రమణ, పులపకుర శుభమహేశ్వరరావు, వింత సురేష్, దాలిపర్తి శ్రీనివాసరావు, ఉబా ఏడుకొండలు, యలమంచిలి సుకుమార్, చాట్రా శ్రీనివాస్, యూత్ గుబ్బల రామకష్ణ, మారేళ్ళ సిద్ధూ, పొట్లకాయల నానిబాబు, గుత్తాల ధ్రువకుమార్ పాల్గొన్నారు.

కోటనందూరు మణిపూర్‌లో హత్యలు, మహిళలపై మానభంగాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని తొండంగి, పాయకరావుపేట, తుని, నక్కపల్లి, కోటనందూరు మండలాలకు చెందిన వేలాది మంది క్రైస్తవులు, ప్రజా సంఘాల నాయకులు, తుని గొల్ల అప్పారావు సెంటర్ నుంచి చర్చి సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆరుగుల మోషే, నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నూతలపాటి సోనీ వుడ్ పాల్గొన్నారు.



కరపలో ఆందోళన చేస్తున్న నాయకులు

మిగులు భూములు పేదలకు పంచాలి


ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ జిల్లాలో వేలాది ఎకరాలు మిగులు భూములు ఖాళీగా ఉన్నాయని వాటిని ప్రజాప్రతినిధులు అన్యాక్రాంతం చేస్తున్నారని కలెక్టర్ జోక్యం చేసుకుని పేదలకు పెంచాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. కాకినాడ రూరల్ రామాలయంలపెపి వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ మహాసభ కె.రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ మాసంలో బాపట్లలో నిర్వహిస్తున్నారన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ రూరల్‌లో ప్రతి గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. కొన్ని దళిత గ్రామాలకు శ్మశానాలు కూడా లేవన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

శృంగార వల్లభ స్వామికి రూ.4.52 లక్షల ఆదాయం

పెద్దాపురం : తిరుపతిలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ.3,54,530, అన్నదానం విరాళాల ద్వారా రూ.89,284, కేశఖండన ద్వారా రూ.9 వేలు ఆదాయం సమకూరిందని దేవస్థానం ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, కుంచే బుచ్చిరాజు, ధర్మకర్తలు పుల్లేటి కుమారి, అమలదాసు లక్ష్మి, రాకుర్తి కుమారి, కుంచే వెంకటరమణ, అడబాల జగ్గారావు, శివ, పెద్దింటి నారాయణచార్యులు, అంజనీ కుమార్ భక్తులకు సేవలందించారు.

కార్టూన్ 'నిజం'



పలుచోట్ల గడప గడపకు..

ప్రజాశక్తి-ఏలేశ్వరం, జగ్గంపేట రూరల్

ఏలేశ్వరం మండలంలోని పెద్దనాపల్లిలో ఎంఎల్ఎ పర్వత ప్రసాద్ శనివారం గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలను కరపత్రాలు ద్వారా వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు బుద్ధ సూర్య ప్రకాశరావు, చిక్కాల లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

జగ్గంపేట రూరల్ మండలంలోని నరేంద్రపట్నంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి తెలిపారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. సురక్ష కార్యక్రమం ద్వారా 11 సేవలను ఉచితంగా ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేంద్రపట్నం సర్పంచ్ బుర్రి చక్రబాబు, ఎంపిపి అత్తులూరి నాగబాబు, వైసిపి సేవాదళ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఒమ్మి రఘురాం, మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు పాల్గొన్నారు.



జగ్గంపేటలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ చంటిబాబు

సాగునీరు అందించడంలో విఫలం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రైతులకు సాగునీటి అందించడంలో వైసిపి ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వరుపుల సత్య ప్రభ అన్నారు. నియోజకవర్గంలోని సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్, ఏలేరు రిజర్వాయర్ ఆధునికరణ పనులు పూర్తిగా మూలన పడ్డాయన్నారు. ఏలేరు, సుబ్బారెడ్డి సాగర్ కాలువలు ఆధునికీకరించకపోవడంతో శివారు పొలాలకు నీరు అందడం లేదన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతలు, తోట వెంకటాచలం ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నాయన్నారు.

ఎపిఒలు, ఎంపిడిఒలకు 31 నుంచి శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మునగాకు ప్రాధాన్యత, పెంపకం, సస్యరక్షణపై శ్రీకాకుళం మొదలు పశ్చిమ గోదావరి జిల్లా వరకు గల ప్రస్తుత 11 జిల్లాలలోని ఎంపిడిఒలు, డ్వామా ఎపిఒలు, ఉపాధి హామీ ఎపిఎంలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ కోస్తా ఆంధ్ర పాత ఐదు జిల్లాలకు సంబంధించి అవి ప్రస్తుతం విభజింపబడిన నేపథ్యంలో 11 జిల్లాల అధికారులకు మునగాకు ప్రాధాన్యత, పెంపకం, సస్యరక్షణ చర్యలపై ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నట్టు తెలిపారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-యు కొత్తపల్లి

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎపి రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడారు. మూలపేట గ్రామం కొత్తవాడ పేటలో సుమారు 50 మంది అర్హులైన మత్సకారులు ఉన్నారన్నారు. తక్షణమే వారికి ఇళ్ళ స్థలాలు మంజూరీ చేయాలని డిమాండ్ చేశారు. వారి పేటను చేర్చి ఇళ్ళ స్థలాలకు అనుకూలమైన ప్రైవేట్ భూమి ఉందని, ప్రభుత్వం ఆ భూమిని సేకరించి వారికి ఇళ్ళ స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, కుంచే అంజిబాబు, ఏడిది పెద్ద బంగారయ్య, వల్లూరి సత్తిబాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో జనసేన పరిశీలన

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి, సామర్లకోట రూరల్

జగనన్న కాలనీలను జనసేన పార్టీ నాయకులు శనివారం సందర్శించారు. పార్టీ నాయకులు తోట సుధీర్, వాసిరెడ్డి శివ, తలాటం సత్య ఆధ్వర్యంలో జనసేన బృందం యు.కొత్తపల్లి మండలం కొమరగిరి జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా తోట సుధీర్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ళ పేరుతో అధికార పార్టీకి చెందిన నాయకులు రూ.కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, అట్ల సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, మండపాక దుర్గాప్రసాద్, సమీర్, కొమిరెడ్డి చిన్న, ధోని, భగవాన్, రావిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సామర్లకోట జి.రాగంపేట రోడ్డులోని కాలనీని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో సందర్శించారు. నివాసయోగ్యం కాని లోతట్టు ప్రాంతాల్లో స్థలాలను ఇచ్చి గృహాలు నిర్మించుకోమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సుంకర కృష్ణవేణి, జిల్లా కార్యదర్శి పిట్టా జానకి రామారావు, నియోజకవర్గ నాయకులు సరోజ వాసు, మంచెం సాయిబాబు, ఉదయ్, పెంకె వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారున రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దండు భరత్ ప్రేమ కుమార్ (15) మల్లేపల్లిలోని తన అమ్మమ్మ ఇంటి నుండి గండేపల్లి బైకుపై వెళుచుండగా మల్లేపల్లి గ్రామ శివారులో వెనుక వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోయింది. ప్రేమ్ కుమార్‌ను బంధువులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. కేసు నమోదు చేసినట్లు గండేపల్లి హెడ్ కానిస్టేబుల్ జిఎస్ఎన్.మూర్తి తెలిపారు.

2,450 కేజీల నల్ల బెల్లం స్వాధీనం

ప్రజాశక్తి -గోకవరం

గోకవరం గ్రామ శివారున సారా బట్టీలపై ఎస్ఇబి సిబ్బంది దాడి చేసి 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నిందితుడు కాంద్రగుల రామును అరెస్టు చేసి వారి వద్ద నుండి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నల్ల బెల్లం సరఫరాదారుడైన ముప్పిడి నాగేశ్వరరావు నాయుడు, రాజేష్‌ల గొడౌన్‌లో తనిఖీలు నిర్వహించి 2450 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎస్ఇబి సిబ్బంది జి.సత్యనారాయణ, టి.నిరంజన్‌రావు, హెచ్‌సి శివకుమార్, నాగేంద్ర కుమార్, అప్పారావు గౌస్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు

ప్రజాశక్తి-కాజులూరు

అనధికారికంగా మద్యం తీసుకొచ్చి అమ్మకం జరుపుతున్న బొర్రా వీరబాబుని అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ జె.వెంకట భవాని తెలిపారు. శనివారం మండలంలోని కోలంకలో అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి వీరబాబు ఇంటిని తనిఖీ చేశామన్నారు. యానాం నుంచి అక్రమంగా తీసుకొచ్చిన 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వీరబాబును అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. వీరబాబును కోర్టులో హాజరు పరిచినట్లు ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ కుమార్ పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో మృతదేహం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం శివారు ఏలేరు కాలువలో పెద్దాపురానికి చెందిన వానపల్లి చిన్న వీర్రాజు (22) మృతదేహం శుక్రవారం ఉదయం లభ్యమయింది. ఎఎస్ఐ సన్యాసిరావు తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి. పెద్దాపురానికి చెందిన వానపల్లి వీర్రాజు రొయ్యల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం పనికి వెళ్ళిన వీర్రాజు కనిపించకపోవడంతో తల్లి వానపల్లి పోచమ్మ, బంధువులు వెతికినా ఫలితం లేకపోయింది. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అయి ఉండడంతో అనేక చోట్ల వెతికారు. ఏలేరు కాలవలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభించిందని సమాచారం అందడంతో వచ్చి చూడగా చిన్న వీర్రాజు మతదేహంగా గుర్తించారు. మేనమామ కాకిలేటి శరభయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని కాట్రావులపల్లి గ్రామ శివారున పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గోదావరి వరదలతో కలవరం..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



ఒక వైపు గోదావరి వరదలు... మరో వైపు సీజనల్ వ్యాధులు ప్రజా జీవనంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వారం రోజులుగా వరద ఉధృతి పెరిగిన విషయం విదితమే. వారాంతంలో తీవ్రత మరింత పెరిగడంతో పరీవాహక ప్రాంతాలలో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని లంకగ్రామాలు ఇప్పటికే జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో కొద్ది మంది తలదాచుకుంటున్నారు. అక్కడ సౌకర్యాలు, వసతులు పూర్తి స్థాయిలోలేకపోవటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. గతేడాది వరదల అనతరం ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చిన విషయం విదితమే. తమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు గోడు వెలిబుచ్చినా ఫలితం లేకపోయింది. బలహీన ఏటిగట్లను గుర్తించి ఆధునీకరిస్తామంటూ ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మిగిలాయి. తిరిగి ఏడాది గడిచే నాటికి సమస్య మళ్లీ పునరావృతమైంది. వరద మొదలైన అనంతరం అధికారులు తూతూ మంత్రంగా ఇసుకబస్తాలతో తాత్కాలిక అడ్డుకట్టులు వేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని గట్ల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో బలహీన ఏటిగట్లు ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కళ్ల కలకలం

జిల్లావ్యాప్తంగా అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయి. కళ్ల కలకల కలవరం మరింత తీవ్ర రూపం దాల్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వేల సంఖ్యలో బాధితులున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, విద్యాలయాల్లో, హాస్టల్స్‌లలో విస్తృతి మరింత వేగంగా ఉంది. చిన్నారులలో సమస్య తీవ్రత అధికంగా ఉండటతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సౌకర్యాలు లేకపోవటంతో ప్రైవేట్ ఆసుపత్రులను, ఆర్ఎంపిలను ఆశ్రయిస్తున్నారు. కళ్ల కలకల బాధితులు కనీసం 3 నుంచి 5 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో ఉండాలని కంటి వైద్యులు చెబుతున్నారు. జ్వర పీడితుల సంఖ్య కూడా గణనీయంగా పెరగడం ఆందోళనకు గురి చేస్తుంది. ఉమ్మడి జిల్లాలోని జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో ఘణనీయంగా రోగుల సంఖ్య పెరుగుతోంది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో దోమల ఉధృతి పెరుగుతోంది. దీంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పిహెచ్‌సిల్లో వైద్య సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటతో రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని కొందరు వైద్యులు పలు రకాల పరీక్షల పేరుతో ప్రజల జేబులకు చిల్లుపెడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. గత నెల రోజులుగా ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం విదితమే. టమోటా ధరలు గత నెల రోజులుగా కేజీ రూ.140 చొప్పున, కిలో మిచ్చి రూ.80 చొప్పున జరుగుతున్న విక్రయాలు కొనుగోలుదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చిక్కుడు కాయలు సైతం కిలో రూ.100 మార్కు దిగిరానంటున్నాయి. ప్రతి ఏటా సీజన్‌లో ఉల్లి ధరలు పెరగటం పరిపాటి. ప్రస్తుతం ఆ స్థానాన్ని టమోటాలు భర్తీ చేశాయి. ప్రతి వంటలోనూ వినియోగించే ఈ రెండింటిలో ఏది ధర పెరిగినా వంట గదిలో రోజు గడవటం కష్టమే. అటువంటి ఈ ధరలు నెల రోజులుగా ఆకాశాన్నంటడంతో సామాన్యులకు కంటి మీద కునుకు కరువైంది. ఇతర కూరగాయలు సైతం కిలో రూ.50 పైమాటే. ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ టమోటా కేవలం కొన్ని రైతు బజార్లకే పరిమితం అవుతోంది. కేజీ రూ.50 చొప్పున అక్కడి అధికారులు విక్రయిస్తున్నప్పటికీ గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని కొనుగోలు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ధరలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మణిపూర్ అమానుషాలపై నిరసనలు

మణిపూర్‌లో జరుగుతున్న అమానుష ఘటనలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, క్రైస్తవ సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఈ వారంలో మిన్నంటాయి. బిజెపి ప్రభుత్వం అక్కడి దుర్మార్గాలను అడ్డుకోకపోవటంతో సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. అక్కడ జరుగుతున్న అమానుష ఘటనలు సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాప్తి జరుగుతున్నాయి. హృదయ విదారక ఘటనలు ప్రతి ఒక్కరినీ కలిచి వేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యహరించి అక్కడి అమానుష ఘటనలను అడ్డుకుని ప్రజలకు రక్షణ కల్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

సాహిత్యానికి సి.నారాయణ రెడ్డి విశిష్ట సేవలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన సి.నారాయణ రెడ్డికి అత్యంత ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారం లభించిందని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం సి.నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, చలనచిత్ర గీతాలు, యాత్ర కథనాలు, సంగీత నృత్య రూపకాలు, బుర్రకథలు, గజల్లు, పలు వ్యాసాలను ఆయన రాశారని అన్నారు. ఆయన రాసిన గ్రంథాలు ఇంగ్లీషు, సంస్కృతి, ఫ్రెంచ్, హిందీ, ఉర్దూ, మలయాళం, కన్నడం వంటి భాషల్లోకి అనువాదం అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం గ్రామ పంచాయతీకి శానిటేషన్ పనులకు దేవస్థానం ఇస్తున్న నిధులను పెంచాలని సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు శనివారం వినతి పత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా రూ.6 లక్షలు మాత్రమే పంచాయతీకి ఇస్తున్నారని, పంచాయతీకి పన్నుల రూపేణా తక్కువ ఆదాయం వస్తోందన్నారు. దీంతో గ్రామాభివృద్ధికి ఇబ్బంది కలుగుతోందన్నారు. అన్నవరం దేవస్థానానికి రోజురోజుకూ యాత్రికుల తాకిడి వల గ్రామంలో శానిటేషన్ పనులు పెరుగుతున్నాయని, అందుకు తగ్గట్టుగా సిబ్బందిని పెంచుకోవాల్సి వస్తోందన్నారు. సిబ్బందిని నియమించ లేకపోతున్నామని, తద్వారా గ్రామంలో శానిటేషన్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిని బట్టి పంచాయతీకి దేవస్థానం ఇస్తున్న నిధులను రూ.15 లక్షలు ఇవ్వాలని కమిషనర్‌ను సర్పంచ్ కోరారు



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ కుమార్ రాజా

ఓటర్ల సర్వే తనిఖీ

ప్రజాశక్తి-పెదపూడి

మండలంలోని సంపరలో ఓటర్ల జాబితా సర్వేను తహాశీల్దార్ సుభాష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటా సమగ్ర ఓటరు సర్వే నిర్వహించాలని, సర్వే పరిశీలన సక్రమంగా లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తహాశీల్దార్ హెచ్చరించారు. పూర్తిగా సమాచారం సేకరించిన వివరాలను రిజిస్ట్రేషన్ ద్వారా బుక్‌లో నమోదు చేసుకోవాలని, అదే సమయంలో అన్‌లైన్‌లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఓటరు జాబితాలో వివరాలు ఉండేలా చూడాలని సూచించారు. బిఎల్‌డి శ్రీరామ్, టిడిపి ప్రతినిధి పలివెల బుజ్జి పాల్గొన్నారు.

కలుషిత నీటితో డయేరియా

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వాతావరణంలో మార్పు, కలుషిత నీరు, పులిసిన ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వచ్చే అవకాశం ఉందని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో డయేరియా నివారణ దినోత్సవంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధారణ పరిస్థితుల్లో వచ్చే విరోచనాలు కాకుండా అతి తరచుగా వస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. నీటితోపాటు లవణాలు, విటమిన్లు బయటకు పోతాయి గనుక పండ్లు అధికంగా తీసుకోవాలని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్

లోతట్టు ప్రాంతాల్లో ఎంఎల్ఎ అశోక్ పర్యటన

ప్రజాశక్తి - యానాం

యానాంలో వరద తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు ధవళేశ్వరం బ్యారేజీకి వచ్చి చేరుతోంది. దీంతో వరద నీటిని భారీగా సముద్రంలోకి వదులుతున్నారు. జిఎంసి బాలయోగి వారధి వద్ద నీటిమట్టం 3.10 మీటర్లకు పెరిగింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి సంబంధిత అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత కనకాల పేట లంక భూమి కోతకు గురవడంతో అక్కడ పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కురసాంపేట, అయ్యన్ననగర్, ఓల్డ్ రాజీవ్ నగర్, ఫెర్రీ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ అశోక్ సూచించారు. మోటర్లు పెట్టి నీరు తోడించాలని ఆదేశించారు.



పంట చేల్లోకి చేరిన వరద నీరు

పంట పొలాల్లోకి ప్రవేశించిన వరద నీరు

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప ఐలాండ్ నెంబర్ 3 వద్ద నున్న ఎస్‌సి సొసైటీ భూముల వరి పండించే పంట చేల్లోకి వరద నీరు చేరింది. గత సంవత్సరం వరదల తాకిడికి జిఎస్పిసి సంస్థ నిర్మించిన గట్టు పూర్తిగా ధ్వంసం అవ్వడంతో అప్పటినుంచి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ సంవత్సరం వచ్చిన వరదలకి పంట చేలలోకి పూర్తిగా వరద నీరు చేరిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రింగ్ బండ్ ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు కమిడి బాలయోగి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి డిమాండ్ చేశారు.

టిబి రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం సామాజిక ఆరోగ్య కేంద్ర పరిధిలో టిబి వ్యాధిగ్రస్తులకు ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తులు మందులతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఆరు నెలలుగా పోషకాలతో కూడిన పాలు, సోయాబీన్, చికీకలు, కందిపప్పు రాగి పిండి, కొమ్ము శనగలు తదితర పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, అలమండ దుర్గాప్రసాద్, కోట శ్రీనివాస్ చక్రవర్తి, సతీష్, వైద్యాధికారి పాపారావు, ఆరోగ్య విస్తరణ అధికారి భాస్కరరావు, సూపర్‌వైజర్ అనిల్ కుమార్ ఉన్నారు.

రామచంద్రయాదవ్‌కు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌కు రక్షణ కల్పించాలని ఆ పార్టీ కార్యకర్తలు ప్రత్తిపాడు సిఐ ఆర్.కిషోర్ బాబుకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బిసి సంఘం నాయకుడు గొంప శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ రామచంద్ర యాదవ్ తిరుపతి నుంచి పుంగనూరు వస్తుండగా మార్గంమధ్యలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనుషులు 9 గంటల పాటు నిలిపివేశారన్నారు. బిసి, ఎస్‌సి మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాన్ని, దౌర్జన్యాలను ఎదుర్కోవాలని ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయ పార్టీ పెట్టారని అక్కసుతోనే అధికార పార్టీ పెద్దలు ఇలా చేస్తున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో నైదాన రఘు, సానబోయిన కుశరాజు, పక్కుర్తి వెంకటరమణ, రాజారపు చక్రరావు, మురుకుర్తి వినోద్, కొల్లు నానాజీ, కొండల శ్రీను, చిన్నారావు, సాయి ఉన్నారు.

ఏలేశ్వరం ఎంపిపి బుజ్జి గృహ నిర్బంధం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎంపిపి గొల్లపల్లి బుజ్జిని పెద్దనాపల్లిలో ఆయన స్వగృహంలో పోలీసులు శుక్రవారం ఎంఎల్ఎ పెద్దనాపల్లి గ్రామ పర్యటన నేపథ్యంలో గృహనిర్బంధం చేశారు. ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ వ్యతిరేకవర్గ ప్రజాప్రతినిధుల్లో ముఖ్యుడుగా ఉన్న ఎంపిపి గొల్లపల్లి బుజ్జి ఎంఎల్ఎ పర్యటనకు ఆటంకాలు సృష్టిస్తారని ఆయనను గృహనిర్బంధం చేసినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ పెద్దనాపల్లిలో సచివాలయ నిర్మాణాలు పూర్తయ్యి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రారంభించలేదన్నారు. దీనిపై అనేకమార్లు ప్రభుత్వాధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేశామన్నారు. నిర్మాణం పూర్తయిన ఒకటో సచివాలయం ప్రారంభించకుండా ఎంఎల్ఎ రెండో సచివాలయం మాత్రమే ప్రారంభించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారన్నారు.



శారదా మున్సిపల్ స్కూల్ ఆవరణ ఇలా..

చిట్టడవిని తలపిస్తున్న పాఠశాల ఆవరణ

ప్రజాశక్తి-మండపేట

పట్టణ పరిధిలోని గొల్లపుంత రోడ్డులో ఉన్న శారదా మున్సిపల్ స్కూల్ ఆవరణ చిట్టడవిని తలపిస్తోంది. పాఠశాల్లో నాడు-నేడు పనులతో ఇసుక, సామగ్రి ఒకవైపు ఉండగా, మరోవైపు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో విద్యార్థులు ఆటలాడు కునేందుకుకు ఉన్న వస్తువులు నిరుపయోగంగా మారాయి. అంతేకాకుండా కొన్ని వస్తువులు తుప్పు పట్టి పోతున్నాయి. దీనిపై ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించాలని, ఆవరణ శుభ్రం చేయడంతో పాటు, విద్యార్థులు ఆటలాడుకునేందుకు అనుగుణంగా ఆట వస్తువులను మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వడ్లమూరులో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

వడ్లమూరులో నిర్వహించిన గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారం కోసం మంజూరైన రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం అధికారులు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కంటే వీర రాఘవరావు మాట్లాడుతూ ఈ పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి, గొల్లపల్లి దొరబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

స్వాతంత్ర్యోద్యమ నేత అరుణా అసఫ్ ఆలీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్వాతంత్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన అరుణ అసఫ్ ఆలీ విద్యావేత్త, రాజకీయ కార్యకర్త, ప్రచురణకర్త అని వాకర్స్ జిల్లా కోఆర్డినేటర్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అరుణ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన అరుణ ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో కూడా చురుకైన పాత్ర పోషించారని అన్నారు. ఇంక్విలాబ్ పత్రికకు సంపాదకత్వం వహించారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేశారన్నారు. పద్మ విభూషణ్, భారతరత్న వంటి పురస్కారాలను ఆమె అందుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

పుంత రోడ్డును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-మండపేట

ఏడిద గ్రామ శివారు కొత్తూరు ప్రజలకు మండపేట వెళ్లేందుకు దగ్గరగా ఉండే కొత్తూరు పుంత రోడ్డును అభివృద్ధి చేయాలని కొత్తూరు ప్రజలు వాహనదారులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్తూరు ప్రజలు మండపేట వెళ్లేందుకు మండపేట-ఏడిద మెయిన్ రోడ్డు నుంచి రావలసి ఉంటుంది. అయితే కొత్తూరుకు సమీపంలోనే పట్టణానికి చెందిన రాజీవ్ గృహకల్ప కాలనీ ఏర్పడడంతో స్థానిక పెద్దమ్మ తల్లి గుడి వద్ద నుంచి కాలనీ వరకు సిసి రోడ్డు వేశారు. నుంచి కొత్తూరు వరకు కూడా రోడ్డును అభివృద్ధి చేసినట్లయితే ఎంతో అనుకూలంగానూ దగ్గరగానే ఉంటుందని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



రాజీవ్ గృహకల్ప నుంచి కొత్తూరు వరకు ఉన్న పుంత రోడ్డు

ప్రబలుతున్న కళ్లకలక

చిన్నారులపై అధిక ప్రభావం..

ప్రజాశక్తి-రామచంద్రపురం

వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. వాటిలో వైరస్ వల్ల వచ్చే కళ్ళకలక ఒకటి. ప్రస్తుతం ఇది చిన్నారుల్లోనూ అధికంగా వ్యాప్తి చెందుతుంది. కళ్ళ కలక సోకిన వెంటనే కళ్ళు ఎర్రబారి మంట పెడతాయి. కళ్ళుకలక వ్యాధి నివారణకు ద్రాక్షారామ ఆరోగ్య కేంద్ర వైద్యులు సందీప్ నాయుడు ను వివరణ కోరగా వైరస్ వల్ల కళ్లకలక వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఇది సోకిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి చూపించుకోవాలని దీనికి అవసరమైన చుక్కల మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కంటినీ నలపరాదని వ్యాధిగ్రస్తమైన కళ్లు నలిపితే కంటి లోపల దెబ్బ తినే అవకాశం ఉందన్నారు. తరచూ సబ్బుతో చేతులు, మొహం కడుక్కుంటూ విశ్రాంతి తీసుకోని, వైద్యులు సూచించిన చుక్కల మందులే వేసుకోవాలని వివరించారు. వైరస్ వల్ల సోకే ఈ కళ్ళకలక వ్యాధి వారం రోజుల్లో తగ్గుముఖం పడుతుందని ఆయన తెలియజేశారు.